క్లుప్తంగా

మాజీ ఎంపీ మేకపాటి పర్యటన

మర్రిపాడు: నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆదివారం నుంచి మూడు రోజుల పాటు మర్రిపాడు మండలంలో పర్యటించనున్నట్లు ఆయన కార్యాలయ సిబ్బంది శుక్రవారం తెలిపారు. ఆది, సోమవారాల్లో బ్రహ్మణపల్లిలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను తెలుసుకుంటారని, మంగళవారం దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ప్రథమ వర్ధంతి కార్యక్రమం వారి స్వగ్రామమైన బ్రహ్మణపల్లిలో జరుగుతుండడంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు.

క్రీడల్లో విద్యార్థినుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

ఉదయగిరి: వింజమూరులో జరిగిన గ్రిగ్స్ మెమోరియల్ ఉదయగిరి నియోజకవర్గ క్రీడా పోటీల్లో గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు త్రోబాల్‌లో ప్రథమ స్థానం సాధించారు. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటేశ్వర్లు, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రియాజ్ విద్యార్థినులను శుక్రవారం గండిపాళెం పాఠశాలలో అభినందించారు. గత మూడు రోజులుగా నియోజకవర్గస్థాయి గ్రిగ్స్ పోటీలు నిర్వహించారు.

ఎన్‌సీసీ నావెల్ క్యాడెట్స్‌కు అభినందన



కావలిరూరల్: నావెల్ యూనిట్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో విశాఖపట్టణంలో జరిగిన నావెల్ శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచిన కావలి జవహర్ భారతి కళాశాల విద్యార్థులు ఆర్.రమణ, జి.కృష్ణప్రశాంత్‌లను ఆ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజగోపాల్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా నావెల్ శిక్షణలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు.

ట్రెజరీ కార్యాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఖజానా ఉప సంచాలకులు గంగాద్రి

ఆత్మకూరు: పట్టణంలోని ట్రెజరీ కార్యాలయాన్ని జిల్లా ఖజానా ఉప సంచాలకులు బి.గంగాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం ట్రెజరీకి వచ్చే చిరుద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల సిబ్బందికి కావాల్సిన పనులను త్వరగా పూర్తయ్యేలా ట్రెజరీ సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఆత్మకూరు ట్రెజరీ అధికారి ఎస్.రవికుమార్, సబ్ ట్రెజరీ అధికారి వి.కిరణ్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

'విజయదీపిక' పుస్తకాల అందజేత


విజయదీపిక పుస్తకాలను చూపుతున్న విద్యార్థినులు

ఆత్మకూరు: పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన విజయదీపిక పుస్తకాలను పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ఎస్కే నజీర్, హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వమే ఉచితంగా ఈ పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అల్లూరు: మండలంలోని బీరంగుంట గ్రామంలో జరిగిన ఇరువర్గాల దాడుల ఘటనపై కావలి డీఎస్పీ వెంకటరమణ, సీఐ రాజేష్ విచారణ చేపట్టి ఇరువర్గాలపై శుక్రవారం కేసులు నమోదు చేశారు. వివరాలు.. పైడేరు కట్ట వద్ద మట్టి ఎత్తే విషయంలో బీరంగుంటకు చెందిన టీడీపీ నాయకుడు తిరుమలశెట్టి నరేంద్రకు.. వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మడి సాయిచరణ్, గుమ్మడి వెంకయ్యలకు మధ్య వివాదం తలెత్తింది. గురువారం రాత్రి ఇరువర్గాల వారు దాడులకు పాల్పడగా తిరుమలశెట్టి నరేంద్రకు, గుమ్మడి వెంకయ్య, అతని భార్య శైలజలకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. మరోమారు ఇలాంటి దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. వారి వెంట బోగోలు ఎస్సై బలరామయ్య, సిబ్బంది ఉన్నారు.

ఆధ్యాత్మిక సిరి

ఆత్మకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి. ఆయా క్షేత్రాల్లో పరమేశ్వరుడు నిత్యం భక్తుల పూజలందుకుంటున్నారు. శనివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆయా క్షేత్రాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- తరతరాల చరిత్ర గల శైవక్షేత్రాల్లో భక్తుల పూజలందుకుంటున్న పరమేశ్వరుడు
- నేడు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన ఆలయాలు
- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

చేజర్ల: కామాక్షీదేవి సమేత కోటేశ్వరస్వామి చేజర్ల మండలంలోని కోటితీర్థంలో కొలువై ఉన్నారు. దాదాపు 13వ శతాబ్దంలో చోళుల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. దక్షిణ భారతదేశంలో ప్రశస్తి పొందిన శైవక్షేత్రాల్లో కోటితీర్థం శివాలయం ఒకటి. జిల్లాలోని పురాతన శివాలయాల్లో ఈ ఆలయానికి ప్రత్యేక స్థానం ఉంది. పరశురాముడు మాతృ హత్యా దోష నివారణ కోసం కోటితీర్థంలో కొంతకాలం తపస్సు చేసిన క్షేత్రం అని, అక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశాడని చరిత్ర ద్వారా తెలుస్తోంది. పినాకిని నది తీరంలో పరశురాముడు తపస్సు చేసిన చోటు కనుక పరశురామ క్షేత్రంగా కూడా కోటితీర్థాన్ని పిలుస్తారు.

మహాశివరాత్రి సందర్భంగా..


చేజర్ల: కోటితీర్థంలోని పురాతన కోటేశ్వరాలయం

ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా ఈ క్షేత్రంలో ఐదు రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఈ నెల 16వ తేదీ నుంచి ఉత్సవాలు జరుగుతున్నాయి. మహాశివరాత్రి పర్వదినం రోజున ఆలయంలో కామాక్షీదేవి సమేత కోటేశ్వరస్వామికి ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహిస్తారు. రాత్రి లింగోద్భవ అభిషేకం, గ్రామోత్సవం నిర్వహిస్తారు. అలాగే స్వామి వారికి అంగరంగ వైభవంగా నందివాహన సేవ ఉంటుంది. భక్తులు వేలాదిగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారు. 19న సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నట్లు ఆలయ పరిరక్షణ కమిటీ చైర్మన్ గోతం మాధవి, కార్యనిర్వాహణాధికారి కుడారి పెంచలప్రసాద్ శుక్రవారం తెలిపారు. నెల్లూరు నుంచి ఆదూరుపల్లి, చేజర్ల మీదుగా కోటితీర్థం శివాలయానికి బస్సు సౌకర్యం ఉంది.

సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

సోమశిల: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అనంతసాగరం మండలంలోని శైవక్షేత్రాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సోమశిల ప్రాజెక్టుకు దిగువన ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం, శతాబ్దాల నాటి చరిత్ర కలిగిన శ్రీకామాక్షి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తారు. రాత్రి లింగోద్భవ కాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. కామిరెడ్డిపాడులోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో, చిలకలమర్రిలోని మల్లెంకొండ శిలల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ శైవక్షేత్రాల్లో భక్తులు పరమేశ్వరుని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. సోమశిలకు నెల్లూరు నుంచి పొదలకూరు, కలువాయి మీదుగా బస్సు మార్గంలో చేరుకోవచ్చు. నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి బుచ్చిరెడ్డిపాళెం, సంగం, ఆత్మకూరు మీదుగా కూడా సోమశిలకు చేరుకోవచ్చు.


సోమశిలలోని సోమేశ్వరస్వామి ఆలయం


కాశీనాయన ఆశ్రమంలో అన్నదానానికి ఏర్పాట్లు

ముమ్మర ఏర్పాట్లు

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శివాలయంలో, కాశీనాయన ఆశ్రమంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శివాలయంలో అర్చకుడు మేళ్లచెరువు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో విశ్వేశ్వరస్వామికి పూజలు, శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. అలాగే కాశీనాయన ఆశ్రమంలో మహాశివరాత్రికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రామచంద్రయ్యస్వామి నేతృత్వంలో వేలాది మందికి అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


నల్లగొండ్లలో గుహమల్లేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

విజమూరు: మండలంలోని నల్లగొండ్లలో ఉన్న గుహమల్లేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. నల్లగొండ్లకు చెందిన అంకినపల్లి ఓబుల్‌రెడ్డి దంపతులు, రూపినేని వెంకటసుబ్బరాయుడు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం మధ్యాహ్నం మృత్యుంజయ హోమం, రాత్రికి అన్నాభిషేకం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

మహిమాన్వితుడు రామలింగేశ్వరుడు

దుత్తలూరు: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితుడిగా దుత్తలూరు ఊరకొండపై వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామిని భక్తులు కొలుస్తున్నారు. గతంలో వర్షాలు లేక తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు స్వామివారి సన్నిధిలో రాత్రి వేళ పూజలు నిర్వహించడంతో కొండ దిగువకు వచ్చేసరికి వర్షాలు పడేవని పెద్దలు చెబుతుంటారు. ఈ సంజీవ పర్వతంపై సంజీవ లతలు ఉండడం వల్లనే ఈ కొండకు సంజీవ పర్వతం అని పేరు వచ్చినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.


దుత్తలూరులో మహాశివరాత్రి వేడుకలకు చేసిన ఏర్పాట్లు

తుకువ రాజుల కాలం నాటి శివాలయం


కావలిలోని పాతూరు శివాలయం

కావలి: పట్టణంలోని పాతూరులో తుకువ రాజుల కాలంలో నిర్మించిన శివాలయం రుద్రపాద క్షేత్రంగా భాసిల్లుతోంది. చారిత్రకమైన నేపథ్యం ఉన్న ఈ శివాలయంలో శ్రీదుర్గా భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి పూజలందుకుంటున్నారు. అమరశిల్పి జక్కన్న వంశీయులు అద్భుత కళానైపుణ్యంతో ఎంతో సుందరంగా ఈ ఆలయంలోని విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు పెద్దలు చెబుతుంటారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 22వ తేదీ వరకు జరుగుతాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించనున్నారు. మహాలింగోద్భవం కాలంలో విశేష పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కావలి పట్టణం నుంచే కాకుండా సమీప గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ నెల 22వ తేదీ రాత్రి స్వామి తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రకృతి ఒడిలో భైరవకోన క్షేత్రం.. ఘటిక సిద్ధేశ్వరం


భైరవకోన క్షేత్రంలో ఒకే రాతిలో చెక్కిన అష్ట దేవాలయాలు


ఘటిక సిద్ధేశ్వరంలో శివలింగం

సీతారామపురం: ప్రకాశం – నెల్లూరు జిల్లాల సరిహద్దులో సీతారామపురానికి 20 కిలోమీటర్ల దూరంలో ప్రకృతి ఒడిలో సుప్రసిద్ధ క్షేత్రంగా భైరవకోన నిత్యం శివనామస్మరణతో మారు మోగుతోంది. ఈ క్షేత్రంలో ఒకే రాయిలో 9 ఆలయాలను చెక్కారు. క్రీ.శ. 6, 7 శతాబ్దాల మధ్య పల్లవ శిల్పకారుడైన ధీరుకంటి శ్రీశైల ముని ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఆ 9 ఆలయాల్లో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. త్రిమూర్తుల్లో ఆదిదేవుడైన మహేశ్వరుడు ఇక్కడ పూజలందుకుంటున్నాడు. భైరవముని తపస్సుకు మెచ్చి ఆదిశంకరుడు భర్గేశ్వరుడిగా ఇక్కడ వెలిశాడని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఇక్కడి జలపాతం పర్యాటకులకు కనువిందు చేస్తుంది. మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే వేడుకలకు నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు ఈ క్షేత్రానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

ఘటిక సిద్ధేశ్వరం

నెల్లూరు – కడప జిల్లాల సరిహద్దులోని తూర్పుకనుమలలో ఉన్న ప్రసిద్ధ శైవక్షేత్రం ఘటిక సిద్ధేశ్వరం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా జరిగే ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సీతారామపురం మండలం పోలంగారిపల్లి నుంచి 12 కిలోమీటర్ల దూరంలో దేవరకొండ పర్వత శ్రేణుల్లో ఈ శైవ క్షేత్రం ఉంది.

దేవమ్మచెరువు పంచాయతీ పరిధిలో ఉన్న ఈ ఆలయాన్ని క్రీ.శ.1406లో విజయనగర రాజు రెండో దేవరాయలు నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. విజయనగరం రాజులతోపాటు వెంకటగిరి, శ్రీకాళహస్తి జమీందారు ఆలయ ధర్మకర్తలుగా వ్యవహరించారు. ఆగస్త్యముని ఒక ఘటిక కాలం స్మరించినంత మాత్రాన ఈశ్వరుడు ప్రత్యక్షమైనందున ఈ క్షేత్రం ఘటిక సిద్ధేశ్వరంగా ప్రసిద్ధి చెందినట్లు పురాణాలు చెబుతున్నాయి.

ఆర్చ్ నిర్మాణ పనుల పరిశీలన


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరు: స్థానిక మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం కూడలి వద్ద ఏర్పాటు చేసిన దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహం వద్ద ఆర్చ్ నిర్మాణ పనులను నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. గతంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన విషయం తెలిసిందే. అయితే ఆ విగ్రహం వద్ద ఆర్చ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఆ పనులను పరిశీలించిన ఆయన కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, కౌన్సిలర్ కామాక్షయ్యనాయుడు, నాయకుడు సీహెచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అటవీశాఖ అధికారులు

ఉదయగిరి: ఉదయగిరి అటవీ రేంజ్ పరిధిలోని అటవీ భూముల్లో మద్యం సేవించడం, పేకాట ఆడడం తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉదయగిరి రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి హెచ్చరించారు. స్థానిక అటవీ రేంజ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి అటవీ సంరక్షణ అంశాలతో ముద్రించిన ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో మట్టి, ఇసుక, రాళ్లు తవ్వడం, చెట్లు నరకడం, అక్రమంగా భూమి సాగు చేయడం చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసులు, ఎఫ్‌ఎస్‌ఓ చినవెంకటయ్య, ఎఫ్‌బీఓలు వెంకటేశ్వర్లు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త రకం వరి వంగడాలు సాగు చేయాలి



అల్లూరు: వాతావరణానికి అనుగుణంగా కొత్త రకం వరి వంగడాలను సాగు చేయాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం నెల్లూరు శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. శనివారం మండలంలోని ఇందుపూరు గ్రామంలో టి.శ్రీనివాసులు అనే రైతు వ్యవసాయక్షేత్రంలో శాస్త్రవేత్తలు క్షేత్రదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఓబయ్య మాట్లాడుతూ రైతులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడంలో మెళుకువలను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సురేఖ, శ్రీలక్ష్మి, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను రక్షించుకుందాం


మాట్లాడుతున్న మాలకొండారెడ్డి

జలదంకి: 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా బాలికలను చదివిద్దాం.. ఆడపిల్లలను రక్షించుకుందామని సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని జమ్మలపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలు డ్రాపౌట్స్ లేకుండా పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య అభ్యసించే వరకు బడులకు పంపాలన్నారు. బాల్యవివాహాల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మౌనిక, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు



వింజమూరు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన గ్రిగ్స్ ఉదయగిరి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల విజేతలకు శుక్రవారం ఆ పాఠశాలలో బహుమతులు అందజేశారు. అథ్లెటిక్స్, గేమ్స్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు. అనంతరం నియోజకవర్గస్థాయి జట్లను ఎంపిక చేశారు. కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఇ.మాలకొండరావు, ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య, పీడీ ఎస్.ప్రభాకర్‌రెడ్డి, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గండారపమ్మకు పొంగళ్లు


పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

చేజర్ల: స్థానిక గ్రామదేవత గండారపమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం ఆలయంలో అమ్మవారికి భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. పొంగళ్ల కార్యక్రమం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు ఇళ్ల వద్ద నుంచి పొంగళ్ల సామగ్రితో మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఆలయం వద్దకు వచ్చి పొంగళ్లు పొంగించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వంటేరు సుధీర్‌కుమార్‌రెడ్డి, గడ్డం వెంకటరమణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ శాఖ ఏడీ దేవసేన సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై పట్టణంలోని పంటవీధి సచివాలయంలో శుక్రవారం ఆమె రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ కిషోర్, ఆర్‌బీకే, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి


వింజమూరు: మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

వింజమూరు: వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ(గుంటూరు, కృష్ణా) కల్పలతారెడ్డి కోరారు. వింజమూరులో స్థానిక ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులతో వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాను ఎమ్మెల్సీగా అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో అపస్మా నాయకులు భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అభిషేక్, ఉదయగిరి నియోజకవర్గ అపస్మా నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సంగం: వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.చంద్రశేఖర్‌రెడ్డి స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఓటు వేయాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథరెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరురూరల్: మురగళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రచారం చేస్తున్న ప్రమోద్‌రెడ్డి

తొలి ప్రాధాన్యత ఓటు వేయండి

ఆత్మకూరురూరల్: వైఎస్సార్‌సీపీ బలపరిచిన తూర్పురాయలసీమ ఉపాధ్యాయుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన తనయుడు రాణా ప్రమోద్‌రెడ్డి అభ్యర్థించారు. ఆత్మకూరు మండలంలోని మురగళ్ల, బట్టేపాడు, అప్పారావుపాళెం, పట్టణంలోని వెస్ట్ స్కూల్ తదితర పాఠశాలల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి, అధ్యక్ష, ఉపాధ్యక్షులు శివశంకర్‌రెడ్డి, సురేంద్ర, నాయకులు పెమ్మసాని శ్రీనివాసులునాయుడు, ప్రసాద్‌గౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పది పరీక్షలపై ప్రత్యేక దృష్టి

ఉదయగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ షేక్.మస్తాన్‌వలి సూచించారు. పదో తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన 'విజయదీపిక' స్టడీ మెటీరియల్‌ను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు.